ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వార్తలు

మంగళవారం 3 సెప్టెంబరు 2024 | 5




# రూ.65 లక్షలతో డయాలసిస్ సెంటర్

- రాజోలు ఆస్పత్రిలో ఏర్పాటు
- పవన్ కల్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా ప్రారంభించిన ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

రాజోలు, సెప్టెంబరు 2: డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా రాజోలు ప్రభుత్వాసుపత్రిలో రూ.65 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన కిడ్నీ డయాలసిస్ సెంటర్‌ను రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ప్రస్తుతం ఐదు డయాలసిస్ మిషన్లు ఏర్పాటు చేశామని, రానున్న రోజుల్లో మరిన్ని డయాలసిస్ మిషన్లు తెచ్చేందుకు కృషి చేస్తామన్నారు. రాజోలులో డయాలసిస్ సెంటర్ లేకపోవడంతో బాధితులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రాజోలు నియోజకవర్గంలో వంద మంది డయాలసిస్ బాధితులు భీమవరం, రాజమహేంద్రవరం, కాకినాడ ప్రాంతాలకు వెళుతుండడంతో ప్రయాణ ఖర్చులు అధికమవుతున్నాయన్నారు. రాజోలులో సెంటర్ ఏర్పాటుతో డయాలసిస్ బాధితులకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు.



అమలాపురంలో నిర్వహించిన పవన్ పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీ హరీష్‌మాధుర్

8

ఉప ముఖ్యమంత్రి, ప్రముఖ సినీ నటుడు పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. మంత్రి సుభాష్, ఎంపీ హరీష్, ఇతర ఎమ్మెల్యేలు వేడుకల్లో పాల్గొన్నారు.



రాజోలు ఆస్పత్రిలో డయాలసిస్ మెషిన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

## అర్జీదారుల ఫిర్యాదులు త్వరితగతిన పరిష్కరించాలి



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం టౌన్, సెప్టెంబరు 2: అర్జీదారుల ఫిర్యాదులకు త్వరితగతిన పరిష్కార మార్గాలు చూపాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, ఐసీడీఎస్ పీడీ ఝాన్సీరాణి, సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎ.మధుసూదనరావుతో కలిసి ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంతో పాటు మండల, డివిజన్ స్థాయిలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందే అర్జీలను చిత్తశుద్ధితో పరిష్కరించాలని సూచించారు. అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి సమస్యలపై అవగాహన కలిగించుకుని క్షేత్రస్థాయిలో పారదర్శకంగా విచారణ నిర్వహించి పరిష్కరించాలన్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారి నుంచి 180 అర్జీలను స్వీకరించారు. సచివాలయ నోడల్ అధికారి కె.భీమేశ్వర్, డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర, డీఈవో ఎం.కమలకుమారితో పాటు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

సమనస పీసీ గురుకుల పాఠశాలలలో 480 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. నాణ్యమైన విద్య అందుతుంది. విద్యార్థులు స్నానానికి ఉపయోగించే గ్రౌండ్ వాటర్ కలుషితం కావడంతో దురదలు, గజ్జి, తామరలు వంటి సమస్యలతో బాధపడుతున్నారు. మురుగునీరు దిగే మార్గం లేక ఎక్కడికక్కడే నీరు నిలిచిపోయి దోమలకు ఆవాసంగా మారింది. దాంతో ప్రస్తుత సీజన్‌లో ఏ వ్యాధుల బారిన పడతారోనని ఆందోళనగా ఉంది. విద్యార్థుల ఆరోగ్య రక్షణలో భాగంగా తక్షణం చర్యలు తీసుకోవాలి అని పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ ఇసుకపట్ల శివ అర్జీ అందించారు.

### ముంపు సమస్య నుంచి కాపాడండి



కడలి శివారు అరవపాలెం ప్రాంతానికి చెందిన రైతులంతా నామనపాలెం మురుగుకాల్వపై ఆధారపడి సాగు చేస్తున్నాం. మేజర్ డ్రెయిన్ గుర్రపుడెక్క, తూడుతో నిండిపోవడంతో వర్షపు ముంపునీరు దిగే పరిస్థితి లేకుండాపోయింది. సుమారు 120 ఎకరాల ఆయకట్టు ముంపు బారిన పడింది. తక్షణం ముంపు దిగేలా తూడు, గుర్రపుడెక్క తొలగించి ఆదుకోవాలని రైతులు అరవ సత్యనారాయణస్వామి, గవర ప్రసాదరావు, బళ్ల సూర్యనారాయణ అర్జీ అందించారు.

## ప్రాణాపాయ స్థితిలో ఉన్నా

- ఆస్తి విక్రయించి నా ఆరోగ్యాన్ని కాపాడండి
- ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో సాయిలక్ష్మీ చంద్ర అర్జీ

వార్త..7లో

# మనుషులు చేసిన దేవుడు







శిల్పకళా గ్రామం.. గాడిలంక

వందలాది మంది కళాకారులు

వినాయక చవితి సీజన్‌లో వేలాది బొమ్మల తయారీ

విదేశాలకు కూడా విగ్రహాల ఎగుమతి

పచ్చని పంట పొలాల మధ్య ఆ గ్రామం రంగురంగుల బొమ్మలతో కళకళలాడుతుంది. అక్కడ శిల్ప కళాకారుల చేతిలో మట్టి అద్భుతమైన శిల్పాలుగా రూపుదిద్దుకుంటుంది. మట్టికి ప్రాణం పోసే అపర బ్రహ్మలు అక్కడ ఉన్నారు. ముమ్మిడివరం మండలం గాడిలంక గ్రామం బొమ్మల తయారీకి పెట్టింది పేరు. బొమ్మల తయారీలో ఇక్కడ కళాకారులకు వందేళ్ల చరిత్ర ఉంది. వందేళ్ల క్రితం పెద్దిరెడ్డి వెంకన్న అనే శిల్పి గ్రామంలో బొమ్మల తయారీని ప్రారంభించారు. అతని కుమారుడు అచ్యుత రామయ్య ద్వారా మిగతా వారు ఈ కళను నేర్చుకున్నారు. గతంలో గ్రామంలో 80 వరకు బొమ్మల తయారీ పరిశ్రమలు ఉండేవి. కుటుంబ సభ్యులతో కలిసి బొమ్మలు తయారు చేసుకుంటూ జీవనం సాగించేవారు. అయితే ప్రస్తుతం 15 కంపెనీలు మాత్రమే ఈ బొమ్మల తయారీ చేస్తున్నాయి.

- (ముమ్మిడివరం)

### ప్రతి ఇంటా బొమ్మల 'కొలువే'

గ్రామంలో ఏ ఇళ్లు చూసినా రకరకాల బొమ్మలు కొలువై ఉంటాయి. ఏడాది పొడవునా ఏవో ఒక విగ్రహాలు తయారు చేస్తుంటారు. ఇక్కడ వినాయకుని బొమ్మల తయారీకి ఓ ప్రత్యేకత ఉంది. చవితికి మూడు, నాలుగు నెలల ముందు నుంచే బొమ్మల తయారీలో కళాకారులు బిజీబిజీగా ఉంటారు. వినాయకచవితి, దీపావళి, శ్రీరామనవమి, సంక్రాంతి వంటి పర్వదినాల్లో వివిధ దేవతా విగ్రహాలు, అందమైన డిబ్బీలు, షోకేస్‌లు, బొమ్మలు తయారు చేస్తుంటారు. పెద్దపెద్ద విగ్రహాలను కాంస్య, సిమెంటు, ఫైబర్ వంటి వాటితో తయారు చేస్తారు. మట్టితో ఆరు అంగుళాల నుంచి 15 అడుగుల వరకు బొమ్మలు తయారు చేస్తారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ అయితే 20 అడుగుల వరకు బొమ్మలు చేస్తారు.



### అన్ని రకాల బొమ్మల తయారీ



చిన్నచిన్న బొమ్మల తయారీకి జిగురు మట్టిని నానబెట్టి కాగితపు గుజ్జు, నావసుద్ద కలిపిమెత్తగా కుమ్మి మిశ్రమంగా తయారు చేస్తారు. పెద్ద బొమ్మలను అయితే ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారుచేస్తారు. ఇక్కడ తయారైన బొమ్మలు కర్ణాటక, ఒడిశా, మహరాష్ట్ర, నల్గొండ, తెలంగాణ, వరంగల్, కరీంనగర్, అదిలాబాద్ వంటి ప్రాంతాలకు తరలించి విక్రయిస్తారు. సీజన్‌కు రూ.కోటి విలువైన బొమ్మలు ఇక్కడి నుంచే ఎగుమతి అవుతాయి. గ్రామానికి చెందిన పెద్దిరెడ్డి వెంకటకృష్ణమాధవరావు అనే శిల్పి ఆర్డరుపై దేశ నాయకులు, రాజకీయ నాయకులు, ప్రముఖుల విగ్రహాలు తయారు చేస్తుంటారు. మాధవరావు తయారుచేసిన విగ్రహాలు ఇతర దేశాలకు సైతం ఎగుమతి అవుతుంటాయి.



### కుటీర పరిశ్రమగా గుర్తించాలి

ఇటీవల బొమ్మల తయారీ కొంత తగ్గింది. కూలీ రేట్లు పెరగడం. ముడి సరుకుల రేట్లు పెరిగిపోవడంతో బొమ్మల తయారీలో గిట్టుబాటు కరువైంది. దీంతో కళాకారుల జీవనోపాధి దెబ్బతింది. అయితే చేస్తున్న వృత్తిని వదులుకోలేక, ఇతర వృత్తులు చేపట్టలేక కళాకారులు వారసత్వంగా వస్తున్న వృత్తితోనే కాలక్షేపం చేస్తూ ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. కొంతమంది యువ కళాకారులైతే ప్రత్యామ్నాయ వృత్తులు ఎంచుకుంటున్నారు. ప్రభుత్వం బొమ్మల తయారీని కుటీర పరిశ్రమగా గుర్తించి కళాకారులకు చేయూతనివ్వాలని కళాకారులు కోరుతున్నారు.



### ప్రభుత్వ ప్రోత్సాహం లేదు



గత 30 ఏళ్లుగా ఇదే వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాను. గిట్టుబాటు లేకపోవడంతో బొమ్మల తయారీ భారంగా మారింది. ప్రభుత్వ ప్రోత్సాహం లభించడం లేదు. ముడిసరుకుల రేట్లు పెరిగిపోవడం, కూలీల కొరత వంటి సమస్యలతో ఇబ్బంది పడుతున్నాం.

మహాదశ సత్యగణేశ్వరరావు, శిల్పి

### పెన్షన్ అందించాలి



బొమ్మల తయారీలో పెయింటింగ్ వేయడం వల్ల 50 ఏళ్లకే ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. 50 ఏళ్లు నిండిన కళాకారులకు పెన్షన్ సదుపాయం కల్పించి ఆదుకోవాలి. 40 ఏళ్లుగా దీనిపైనే ఆధారపడి కుటుంబమంతా జీవిస్తున్నాం. అయినా సంపాదించిందేం లేదు..

కొమ్మిరెడ్డి సూర్యచంద్రరావు, శిల్ప కళాకారుడు

### డిమాండ్ ఉన్నా గిట్టుబాటు లేదు



మూడు తరాలుగా ఈ బొమ్మల తయారీలో జీవనం సాగిస్తున్నాం. నేను 30 ఏళ్లుగా ఈ వృత్తిలో ఉన్నాను. సంప్రదాయంగా వస్తున్న ఈ వృత్తిని వదులుకోలేక తయారు చేస్తున్నాం. రోజురోజుకు గిట్టుబాటు కరువవుతోంది. బొమ్మలకు డిమాండు ఉన్నా గిట్టుబాటు లేకపోవడంతో ఈ పరిశ్రమను నడపలేకపోతున్నాం. రోజువారీ వేతనం మాత్రమే వస్తోంది.

పెద్దిరెడ్డి సత్యనారాయణమూర్తి, శిల్పి

# సీఎస్ఆర్ నిధులు ఎక్కువ మంజూరు చేయాలి

కలెక్టరేట్‌లోని సమీక్షలో మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు




సమీక్షలో పాల్గొన్న మంత్రి, కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యేలు

అమలాపురం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఓఎన్జీసీ కార్యాలయాలు కాకినాడ, రాజమహేంద్రవరాల్లో ఉన్నప్పటికీ సంస్థ నిర్వహిస్తున్న కార్యకలాపాలన్నీ జిల్లాలోనే ఎక్కువగా ఉన్నాయని జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు చెప్పారు. కోనసీమ ప్రాంతానికి సీఎస్ఆర్ నిధులు ఎక్కువగా మంజూరు చేసేలా సంస్థ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఓఎన్జీసీ గతంలో హామీ ఇచ్చినట్టుగా జిల్లాలోని ఏ ఒక్క గ్రామంలో కూడా పూర్తిగా సీఎస్ఆర్ కింద అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం ఓఎన్జీసీ ప్రతినిధులతో రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీ గంటి హరీష్‌మాధుర్, అమలాపురం, ముమ్మిడివరం, మండపేట, కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు ఎమ్మెల్యేలు అయితాబత్తుల ఆనందరావు, దాట్ల సుబ్బరాజు, వేగుళ్ల జోగేశ్వరరావు, బండారు సత్యానందరావు, గిడ్డి సత్యనారాయణ, దేవ వరప్రసాద్, కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పాల్గొని ఓఎన్జీసీ జిల్లాలో చేస్తున్న సీఎస్ఆర్ కార్యకలాపాలపై సమీక్షించారు. ఓఎన్జీసీ ఈ ఏడాది మత్స్యకారులకు ఎటువంటి పరిహారం చెల్లించలేదన్నారు. ఓఎన్జీసీ ప్రాజెక్టులు నిర్మించే సమయంలో జిల్లాలోని రోడ్లు, బ్రిడ్జిలు పాడవుతున్నాయని, వాటికి మరమ్మతులు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఓఎన్జీసీ ప్రాజెక్టులు స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ శాఖల అనుమతులు లేకుండా పైపులైన్లు వేస్తున్నారని, సంబంధిత శాఖల అనుమతులు తీసుకోవాలన్నారు. కొన్ని ప్రాంతాల్లో పైపులైను లీకుల వల్ల, వరదల సమయాల్లో రొయ్యలు, చేపల చెరువుల్లో వ్యర్థాలు చేరి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, వారికి పరిహారం చెల్లించాలన్నారు. అమలాపురం పట్టణాభివృద్ధికి సహకరించాలని కోరారు. ఏ నియోజకవర్గానికి ఏ మేర నిధులు కేటాయిస్తున్నారో సంబంధిత ఎమ్మెల్యేలకు సమాచారం ఇవ్వాలన్నారు. కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ మాట్లాడుతూ గత పదేళ్లలో జిల్లా నుంచి 14 వేల మంది చిన్నచిన్న ఉద్యోగాల కోసం విదేశాలకు వెళ్లినట్టు తెలిపారు. స్థానికంగానే ఉద్యోగాలు కల్పించేందుకు అవసరమైన నైపుణ్యాలు అభివృద్ధి చేస్తామని తెలిపారు. సీఎస్ఆర్ కింద జరిగే పనులు పరిశీలించేందుకు వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఓఎన్జీసీ అసెట్ మేనేజర్ శాంతన్‌దాసు, కాకినాడ అసెట్ మేనేజర్ రత్నేష్ మాట్లాడుతూ గడిచిన మూడేళ్లలో ఉమ్మడి జిల్లాలో సీఎస్ఆర్ నిధుల కింద రూ.17.31 కోట్లు మంజూరు చేయగా రూ.13.35 కోట్లు కోనసీమలో ఖర్చు చేశామన్నారు. యుటిలైజేషన్ సర్టిఫికెట్లు సమర్పిస్తే తదుపరి నిధులు మంజూరు చేస్తామన్నారు. ప్రజాప్రతినిధులు తీసుకువచ్చిన సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. సీపీవో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### విపత్తు ప్రభావిత ప్రాంతాలను గుర్తిస్తూ మ్యాపులు సిద్ధం చేయాలి: కలెక్టర్

అమలాపురం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రకృతి విపత్తుల సమయంలో ప్రభావితమయ్యే ప్రాంతాలను గుర్తిస్తూ మండలాల వారీగా మ్యాప్‌లను సిద్ధం చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జలవనరుల శాఖ, విద్యుత్ శాఖల అధికారులతో వరదలు, తుఫానులపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో మండలాల వారీగా కాల్వలు, డ్రెయిన్లు, హెడ్‌వర్క్స్ విభాగాల్లోని అసెట్స్‌ను గుర్తిస్తూ మ్యాపులు తయారు చేయాలన్నారు. లాకులు, షట్టర్లు, డ్రైనేజీల్లో క్లానింగ్ ప్రదేశాలు, అవుట్‌ఫాల్ స్లూయిస్‌లు, ఏటిగట్లను మ్యాప్‌లలో గుర్తించాలన్నారు. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద ప్రమాద హెచ్చరికలు జారీ చేసినప్పుడు ప్రభావితమయ్యే ప్రాంతాలు, విద్యుత్ ఉపకేంద్రాలు, గ్రామాలను గుర్తిస్తూ విడివిడిగా మూడు మ్యాప్‌లను సిద్ధం చేయాలన్నారు. భవిష్యత్తులో విపత్తుల సమయంలో నష్టాలను తగ్గించేందుకు కృషి చేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, హెడ్‌వర్క్స్ ఈఈ విశ్వేశ్వరరావు, డీపీవో డి.రాంబాబు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.



పి.గన్నవరం అక్విడెక్టు వద్ద వరద ఉధృతి



కాజ్‌వేపై వరద నీరు

# హమ్మయ్యా..!

తగ్గుముఖం పట్టిన వర్షాలు..

ఊపిరి పీల్చుకున్న ప్రజలు

మళ్లీ గోదావరికి పెరుగుతున్న వరద

అమలాపురం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): గత కొన్ని రోజుల నుంచి విస్తారంగా కురిసిన భారీ వర్షాలు క్రమంగా తగ్గు ముఖం పట్టడంతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు. కోనసీమ జిల్లాలో గత కొన్ని రోజుల నుంచి ఒక మోస్తరు వర్షాలు మాత్రమే కురవడం వల్ల పెద్దగా నష్టాలేమీ సంభవించలేదు. కలెక్టర్ మహేష్‌కుమార్ ఆధ్వర్యంలో జిల్లా యంత్రాంగం ఎప్పటికప్పుడు పరిస్థితులను పర్యవేక్షిస్తూ ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు జిల్లాలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలకు సోమవారం వరకు సెలవులు ప్రకటించారు. అయితే గత రెండు రోజుల నుంచి వర్షాలు అనూహ్యంగా తగ్గుముఖం పట్టాయి. వాతావరణం పొడిగా మారి ఎండ పొరలు రావడంతో జిల్లా ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ప్రస్తుతం వరి రైతులు వర్షాల వల్ల ఏర్పడ్డ పరిస్థితుల నుంచి గట్టెక్కేందుకు సస్యరక్షణ చర్యలు చేపట్టారు. ముంపు నీటిని బయటకు తోడే ఏర్పాట్లు చేస్తున్నారు. తాజాగా గోదావరి వరద ఉధృతి మళ్లీ పెరుగుతుండడంతో కోనసీమలోని నదీపరివాహక మండలాల ప్రజలు మళ్లీ ఆందోళన చెందుతున్నారు.

# కనకాయలంక కాజ్‌వేపైకి వరద నీరు

పి.గన్నవరం, సెప్టెంబరు 2: గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరికి ఎగువ ప్రాంతాలు నుంచి భారీగా వరదనీరు వచ్చి చేరడంతో గోదావరికి మళ్లీ వరదపోటు మొదలైంది. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి దిగువకు సుమారుగా 5 లక్షల క్యూసెక్కులు దాటి నీరు వదులుతున్నారు. దీంతో గౌతమి, వృద్ధగౌతమి, వైనతేయ, వశిష్ట నదీపాయలు నిండుగా ప్రవహిస్తున్నాయి. సోమవారం పెరిగిన వరద ఉధృతికి సరిహద్దు ప్రాంతం చాకలిపాలెం వద్ద కనకాయలంక కాజ్‌వేపైకి వరదనీరు చేరుకుని సాయంకాలనికి కొంతమేర ఉధృతి తగ్గింది. అయితే పి.గన్నవరం మండలంలోని గంటిపెదపూడి శివారు పెదపూడిలంక, బూరుగులంక, అరిగెలవారిపేట, ఉడిమూడి శివారు ఉడిమూడిలంక గ్రామాల ప్రజలు వరదలు ప్రారంభం నుంచి పడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు. అదే విధంగా పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన సరిహద్దు గ్రామాలు పెదమల్లంక, అనగార్లంక గ్రామాల్లో కూడా నాటు పడవలపైనే ప్రయాణం చేస్తున్నారు.



గంటిపెదపూడి బూరుగులంక నదీపాయ వద్ద పడవపై రాకపోకలు


హుండీల్లో వచ్చిన కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

## సత్యదేవుని హుండీల ఆదాయం రూ.1.64 కోట్లు

అన్నవరం, సెప్టెంబరు 2: రత్నగిరివాసుడైన సత్యదేవుడికి భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను సోమవారం లెక్కించగా రూ.1,64,18,601 నగదు, 44 గ్రాముల బంగారం, 1880 గ్రాముల వెండి సమకూరాయి. 420 యుఎస్ఏ డాలర్లు, 490 యుఏఈ దిరహమ్స్, 140 ఇంగ్లాండ్ పౌండ్స్, మలేషియా డాలర్లు 100 లభించాయి. 34 రోజులకు ఈ ఆదాయం వచ్చినట్టు ఆలయ అధికారులు వెల్లడించారు. ఈవో రామచంద్రమోహన్, చైర్మన్ రోహిత్ పర్యవేక్షణలో జరిగిన లెక్కింపులో పురోహితులు, నాయీబ్రాహ్మణులు, సిబ్బంది పాల్గొన్నారు.


శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానంలో లక్ష బిల్వార్చన చేస్తున్న రుత్వికులు

## శ్రీపాద శ్రీవల్లభుడికి లక్ష బిల్వార్చన



పిఠాపురం, సెప్టెంబరు 2: కాకినాడ జిల్లా పిఠాపురంలోని శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానంలో శ్రీపాద శ్రీవల్లభులకు లక్ష బిల్వార్చన వైభవంగా జరిగింది. శ్రీపాద శ్రీవల్లభ జయంతి సప్తాహ మహోత్సవాల్లో రెండో రోజైన సోమవారం అర్చకులు, రుత్వికులు, వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య బిల్వార్చన నిర్వహించారు. శ్రీపాద శ్రీవల్లభుడు, దత్తాత్రేయ స్వామి, నృసింహ సరస్వతిలను విశేషంగా అలంకరించారు. అనంతరం మహన్యాసపూర్వక శత రుద్రాభిషేకం, సర్వ పుష్ప పూజ, శ్రీసూక్త, పురుష సూక్తాలతో సహస్ర నామార్చన, మంగళహారతి, వేద పారాయణ, రుత్విక్కులచే దత్త మూలమంత్ర అనుష్ఠానం, గురుచరిత్ర పారాయణ, శ్రీపాద శ్రీవల్లభ చరితామృత పారాయణ జరిగాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి ఆర్.సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

## సృజనాత్మక శక్తికి ఊతమిచ్చేలా
# విద్యార్థి విజ్ఞాన మంథన్




కాకినాడ రూరల్, సెప్టెంబరు 2: విద్యార్థి దశలోనే మేథస్సుకు పదునుపెడితే జిజ్ఞాస పెంచి వారి ఉజ్వలమైన భవితకు బాటలు వేయవచ్చు. ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి ఏటా అనేక ప్రోత్సాహక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తికి ఊతమిచ్చేలా ప్రయోగాలు, పరిశోధనల్లో రాణించేలా కేంద్ర ప్రభుత్వం విద్యార్థి విజ్ఞాన్ మంథన్ (వీవీఎం) పేరిట జాతీయస్థాయిలో ప్రతిభాన్వేషణా పరీక్ష నిర్వహిస్తోంది. కేంద్ర ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక సమాచార సంస్థ ఆధ్వర్యంలో విజ్ఞాన భారతి, ఎన్‌సీఈఆర్టీ, విజ్ఞాన ప్రసాద్ సంస్థలు సంయుక్తంగా ఈ పరీక్ష నిర్వహిస్తున్నాయి. 2024-25 సంవత్సరానికి సంబంధించి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల, కళాశాలల్లో ఆరవ తరగతి నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ చదువుతున్న విద్యార్థులకు ఎన్‌సీఈఆర్టీ, ఎస్సీఎస్ఎం, సీబీఎస్ఈ, స్టేట్ బోర్డు కలిపి ఈ పరీక్ష నిర్వహిస్తాయి. ఈ పరీక్షలో ప్రతిభ కనబరిచిన వారికి దేశంలోని ప్రముఖ పరిశోధనా సంస్థల్లో ఇంటర్న్‌షిప్‌తో పాటు ఏడాది పాటు నెలకు రూ.2వేలు చొప్పున భాస్కర స్కాలర్‌షిప్ పొందే అవకాశం కలుగుతుంది. దరఖాస్తు ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది.

**వంద మార్కులకు పరీక్ష:**

జూనియర్ విభాగంలో (6 నుంచి 8వ తరగతి), సీనియర్ విభాగంలో (9 నుంచి 11 వరకు) 100 ప్రశ్నలకు వంద మార్కులు వుంటాయి. పాఠశాల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ప్రతిభ కనబరుస్తూ జాతీయ స్థాయిలో అంతర్జాలం ద్వారా పరీక్షరాయవచ్చు. ఇంటి నుంచే ఆన్‌లైన్ విధానంలో స్మార్ట్‌ఫోన్, ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్ ద్వారా పాల్గొనవచ్చు. హిందీ, తెలుగు, ఆంగ్లంతో పాటు ఎనిమిది ప్రధాన ప్రాంతీయ భాషల్లో ఈ పరీక్ష నిర్వహిస్తారు.

**ప్రత్యేక శిక్షణ:** వీవీఎంలో పాల్గొన్న విద్యార్థులకు పాఠశాల స్థాయిలో 6 నుంచి 11 తరగతులకు ప్రతి తరగతిలోనూ ప్రతిభ చూపిన మొదటి ముగ్గురు చొప్పున మొత్తం 18 మందికి ప్రతిభా పత్రాలను ఆన్‌లైన్‌లో అందజేస్తారు. జిల్లాస్థాయిలో కూడా ఇదే విధంగా అందజేస్తారు. 120 మంది విద్యార్థులను రాష్ట్రస్థాయి శిబిరానికి ఎంపిక చేసి... దానిలో ప్రతిభ చూపిన ప్రతి తరగతి నుంచి ముగ్గురు చొప్పున మొత్తం 18 మందిని రాష్ట్ర స్థాయి విజేతలుగా ప్రకటించి వారికి రూ.5,000 (ప్రథమ), రూ.3,000 (ద్వితీయ), రూ.2,000 (తృతీయ) బహుమతులతో పాటు మెమెంటో, ధ్రువపత్రం ఇస్తారు. జాతీయ, జోనల్ స్థాయి విజేతలుగా నిలిచిన 18 మంది విద్యార్థులను హిమాలయన్స్‌గా ప్రకటిస్తారు. వారికి రూ.25వేలు (ప్రథమ), రూ.15వేలు (ద్వితీయ), రూ.10వేలు (తృతీయ) బహుమతులతో పాటు మెమెంటో, ధ్రువపత్రం ఇస్తారు. అంతే కాకుండా వారికి డీఆర్డీవో, ఇస్రో, సీఎస్ఐఆర్, బార్క్‌లలో 3 వారాల పాటు ప్రత్యేక శిక్షణ ఉంటుంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో గత ఏడాది రాష్ట్ర స్థాయికి 20 మంది విద్యార్థులు ఎంపికయ్యారు.

- దరఖాస్తుకు గడువు : సెప్టెంబరు 15
- నమూనా పరీక్ష : అక్టోబరు 10
- ఫీజు: రూ.200
- రాష్ట్ర స్థాయి పరీక్ష : నవంబరు 26 లేదా డిసెంబరు 3, 10, 17 తేదీల్లో
- ప్రధాన పరీక్ష: అక్టోబరు 23 నుంచి 27
- సమయం : ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల మధ్యలో (90 నిమిషాలు మాత్రమే. ప్రతి విద్యార్థి పరీక్షకు ఒకసారి మాత్రమే లాగిన్ అవ్వాలి)

- ఏటా జాతీయ స్థాయి ప్రతిభాన్వేషణ పరీక్ష
- ప్రథమ విజేతకు రూ.25వేల నగదు బహుమతి
- ప్రముఖ పరిశోధనా సంస్థల్లో ఇంటర్న్‌షిప్‌కు అవకాశం



### విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

**పిల్లి రమేష్, డీఈవో, కాకినాడ జిల్లా**

విద్యార్థి విజ్ఞాన్ మంథన్ ప్రతిభాన్వేషణా పరీక్షను సద్వినియోగం చేసుకునేలా విద్యార్థులను ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి. వారికి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలి.

### ప్రతిభ నిరూపణకు చక్కని వేదిక



**కేసరి శ్రీనివాసరావు, కౌశల్ జిల్లా సమన్వయకర్త**

విద్యార్థులు తమ ప్రతిభను నిరూపించుకునేందుకు ఈ పరీక్ష చక్కని వేదిక. విద్యార్థి స్థాయి నుంచే శాస్త్రవేత్తలను తయారు చేయడానికి కేంద్ర ప్రభుత్వ సంస్థ నిర్వహిస్తున్న పరీక్షల్లో ఇది ఒకటి.

### ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి

**ఎన్.శ్రీనివాస్ వినీల్, కాకినాడ జిల్లా సైన్స్ అధికారి**

ఈ పరీక్షకు ఎక్కువ మంది విద్యార్థులు రిజిస్టర్ చేసుకునేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి. దీనివల్ల విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలు పెంపొందుతాయి.




సాయిలక్ష్మీచంద్ర ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్న ఎంపీ హరీష్‌మాధుర్

## ప్రాణాపాయ స్థితిలో ఉన్నా

- ఆస్తి అమ్మించి నా ఆరోగ్యాన్ని కాపాడండి
- ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో సాయిలక్ష్మీ చంద్ర అర్జీ

అమలాపురం టౌన్, సెప్టెంబరు 2: ప్రాణాపాయ స్థితిలో ఉన్నా... బంధువుల నుంచి కూడా ప్రాణ హాని ఉంది. తండ్రిద్వారా సంక్రమించిన ఆస్తిని అమ్మి ఆరోగ్యాన్ని కాపాడాలని రాజులపూడి సాయిలక్ష్మీచంద్ర వేడుకుంటోంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు ఆమె తల్లి ఆరుద్రతో కలిసి వచ్చి అర్జీ అందించింది. 99శాతం దివ్యాంగురాలైన తనకు ప్రాణ రక్షణ కల్పించాలంది. తండ్రి ద్వారా సంక్రమించిన ఆస్తిని సొంతం చేసుకోవాలని కొందరు కుటుంబ సభ్యులు ప్రయత్నిస్తున్నారని వివరించారు. ప్రాణ రక్షణ కల్పించడంతో పాటు ఆస్తిని అమ్మి ఆరోగ్యాన్ని కాపాడాలని వేడుకుంది. ముందుగా ఎంపీ గంటి హరీష్‌మాధుర్‌ను కలుసుకున్నారు. వైద్య సేవల కోసం తన వంతు సహకారం అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఎస్పీ కృష్ణారావుతో ఎంపీ ఫోనులో మాట్లాడి సాయిలక్ష్మి పరిస్థితిని వివరించారు. పట్టణ పోలీసుస్టేషన్‌లో ఎన్నోసార్లు ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలోనే అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని ఎంపీ భరోసా కల్పించారు.

## డాక్టర్ సృజనకు ఢిల్లీ ఎయిమ్స్‌లో పీజీ సీటు



సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 2: కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ వాకలపూడి సంతోష్‌నగర్‌కు చెందిన విశ్రాంత సైనికుడు సూర్యదేవర రామారావు కుమార్తె డాక్టర్ సృజన ప్రతిష్ఠాత్మకమైన ఢిల్లీ ఎయిమ్స్‌లో అనస్తీషియా విభాగంలో పీజీ సీటు సాధించింది. కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీ 2017 బ్యాచ్‌కు చెందిన సృజన వైద్య విద్యపై చేసిన పలు పరిశోధనలు, సైద్ధాంతిక వ్యాసాలకు 12 గోల్డ్ మెడల్స్ సాధించి బెస్ట్ అవుట్ గోయింగ్ స్టూడెంట్‌గా నిలిచింది. పీజీ ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబరిచి సీటు దక్కించుకుంది. డాక్టర్ సృజనను ఆర్ఎంసీ ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు అభినందించారు. సైనికుడిగా తండ్రి రామారావు దేశానికి సేవలు అందించారని, అయన వారసత్వాన్ని పుణికి పుచ్చుకుని పేదలకు ఉచిత వైద్య సేవలందిస్తున్న సృజనకు నగర ప్రముఖులు పలువురు అభినందనలు తెలిపారు.

# రెండో రోజూ కొన్ని రైళ్లు రద్దు

- మరికొన్ని దారి మళ్లింపు
- ప్రయాణికులకు తప్పని అవస్థలు

సామర్లకోట, సెప్టెంబరు 2: రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలకు ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు పెద్ద ఎత్తున చేరుకోవడంతో పలు రైల్వే ట్రాక్‌లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో విజయవాడ సెక్షన్‌లో రెండో రోజు అయిన సోమవారం పలు రైళ్లను రద్దు చేయగా మరికొన్ని రైళ్లను దారి మళ్లించారు. ప్రస్తుతం నిడదవోలు, భీమవరం, గుడివాడ మీదుగా విజయవాడ రాకపోకలు సాగిస్తున్నాయి. రైళ్ల వేగాన్ని తగ్గించి నడపడంతో గంటల తరబడి ఆలస్యంగా నడుస్తున్నాయి. సోమవారం ఉదయం 8.30 గంటలకు సామర్లకోట చేరుకోవాల్సిన ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ మూడు గంటల ఆలస్యంగా వచ్చింది. ముంబై నుంచి భువనేశ్వర్ వెళ్లే కోణార్క్ ఎక్స్‌ప్రెస్ 12.30 గంటలకు రావాల్సి ఉండగా నాలుగున్నర గంటలు ఆలస్యంగా వచ్చింది. ఆరు గంటలకు రావాల్సిన ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్ మూడు గంటలు ఆలస్యంగా నడిచింది. సికింద్రాబాద్ నుంచి విశాఖ వెళ్లాల్సిన జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రెండు గంటలు ఆలస్యంగా ఆరు గంటలకు వచ్చింది. బొకారో ఎక్స్‌ప్రెస్ సుమారు రెండున్నర గంటలు ఆలస్యమైంది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందిపడ్డారు. సామర్లకోట స్టేషన్ మొదటి ప్లాట్‌ఫామ్‌పై హెల్ప్ డెస్క్ కొనసాగించినట్టు సూపరింటెండెంట్ ఎం.రమేష్ చెప్పారు.

**సోమవారం రద్దయిన రైళ్ల వివరాలు....**

సికింద్రాబాద్-విశాఖ (22204), కడప-విశాఖ (17487), విశాఖపట్టణం-సికింద్రాబాద్ (12805), భువనేశ్వర్-బెంగళూరు (18463), తిరుపతి-కాకినాడ (17249), విశాఖపట్టణం-కడప (17488), విశాఖపట్టణం-తిరుపతి (08583), విశాఖపట్టణం-చెన్నై సెంట్రల్ (22869), భువనేశ్వర్-సికింద్రాబాద్ (17015), గుంటూరు-విశాఖపట్టణం (22702), భువనేశ్వర్-ముంబయి (11020), విశాఖపట్టణం-గుంటూరు (22701)

**మంగళవారం రద్దు చేసిన రైళ్ల వివరాలు**

సికింద్రాబాద్-విశాఖ (20707), విశాఖ-సికింద్రాబాద్ (20708), విశాఖపట్టణం-సికింద్రాబాద్ (20833), సికింద్రాబాద్-విశాఖపట్టణం (20834), బెంగళూరు-హౌరా (12864), తిరుపతి-విశాఖపట్టణం (08584), తిరుపతి-పూరి (17480), మహబూబ్‌నగర్-విశాఖపట్టణం (12862), విశాఖపట్టణం-మహబూబ్‌నగర్ (12861), తిరుపతి-విశాఖపట్టణం (08584), సికింద్రాబాద్-షాలీమార్ (12774)

**4వ తేదీన రద్దయిన రైలు**

షాలీమార్-సికింద్రాబాద్ (12773)

**దారి మళ్లించిన రైళ్లు**

హైదరాబాద్-షాలీమార్ (18046), న్యూఢిల్లీ-విశాఖపట్టణం (20806), విశాఖపట్టణం-న్యూఢిల్లీ (22805), హైదరాబాద్-విశాఖపట్టణం (12728)... ఇవి పగిడిపల్లి, గుంటూరు, విజయవాడ మీదుగా వెళ్తాయి.


స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలతో ఎస్ఐ ఆదినారాయణ

## 20 కిలోల గంజాయి స్వాధీనం

**ఆరుగురిని అరెస్టు చేసిన రాజమహేంద్రవరం వన్ టౌన్ పోలీసులు**

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అటు గంజాయి అమ్ముతూ... ఇటు ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తూ విలాస జీవితానికి అలవాటుపడిన ఆరుగురిని తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం వన్‌టౌన్ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. జాంపేటలోని ముగ్గుపేట చర్చి సెంటర్ సమీపంలో సమాధుల వద్ద నిల్వ ఉంచిన 20కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేశారు. సీటీఆర్ఐ సుబ్బారావునగర్‌కి చెందిన తేలంశెట్టి సాయి భార్గవ్, తాడితోట అంబేడ్కర్ నగర్‌కి చెందిన నేతల వివేక్ (మార్లిస్), బత్తిన రవితేజ, దాసరి చందు, రెల్లిపేటకు చెందిన రాయి సింహాద్రి అప్పన్న, వీరభద్ర నగర్‌కి చెందిన సోరా దుర్గను అదుపులోకి తీసుకున్నామని సీఐ ఎస్.మురళీకృష్ణ పేర్కొన్నారు. భార్గవ్, మార్లిస్ నుంచి వివిధ కేసులకు సంబంధించి కారు, 10 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ ఆదినారాయణలను ఎస్పీ నరసింహ కిషోర్, డీఎస్పీ రమేశ్‌బాబు అభినందించారు.

## వెల్ల నివేశనా స్థలాల కేసు కొట్టివేత

ద్రాక్షారామ, సెప్టెంబరు 2: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం వెల్ల లాకుల వద్ద నివేశనా స్థలాల కేసును రామచంద్రపురం సీనియర్ సివిల్ జడ్జి కోర్టు సోమవారం కొట్టివేసింది. వెల్ల లాకుల వద్ద నివాసముంటున్న 22 మంది పట్టాదారులను ఖాళీ చేయించేందుకు 2012 మార్చి 20న రెవెన్యూ, పోలీసు యంత్రాంగాలు చర్యలు చేపట్టాయి. స్థలాలు ఖాళీ చేయించడాన్ని లబ్ధిదారులు, రైతుకూలీ సంఘం నాయకులు అడ్డుకున్నారు. ఈ ఘటనలో పలువురు గాయపడ్డారు. రైతు కూలీ సంఘం నాయకులు ఉండ్రు గనిరాజు, బత్తుల సిద్ధూలతో పాటు 19 మందిపై కేసులు నమోదు చేశారు. 12ఏళ్ల పాటు విచారణ జరిగింది. సీనియర్ సివిల్ జడ్జి, అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టులో కేసు కొట్టి వేసినట్టు పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ తెలిపారు. దీనిపై ఆయనతో పాటు రైతు కూలీ సంఘం నాయకుడు వెంటపల్లి భీమశంకరం హర్షం వ్యక్తం చేశారు. న్యాయవాదులు నీలం మధుసూదనరావు, సూరంపూడి సత్యనారాయణ, పచ్చిమళ్ల సంపతరావు, నీలం స్నేహలతలకు వారు కృతజ్ఞతలు తెలిపారు. పట్టాదారులు 22 మందికి న్యాయం చేయాలని మంత్రి సుభాష్‌కు రైతు కూలీ సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు.

# శృంగవరంలో డయేరియా విజృంభణ

- రౌతులపూడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 21 మంది


డయేరియా బాధితులను పరామర్శిస్తున్న జిల్లా వైద్యాధికారి నరసింహనాయక్

రౌతులపూడి, సెప్టెంబరు 2: కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం శృంగవరం గ్రామంలో డయేరియా విజృంభించింది. అధ్వాన పారిశుధ్యంతో గ్రామస్థులు డయేరియా బారిన పడ్డారు. అల్లు పాదలియ్య, గొనగాలి పెంటమ్మ, ఈగల వీరబాబు, కోన రమణ, జి.సత్యవతి, లొండా గోవిందమ్మ, అల్లు గంగరాజు, జి.లోవసత్తిబాబు, అల్లు రమణ, గదులు రమణ సహా 21మంది రౌతులపూడి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న జిల్లా వైద్యాధికారి నరసింహనాయక్, సహాయ వైద్యాధికారి పి.సరిత గ్రామంలో పర్యటించారు. డయేరియా ప్రబలడానికి గల కారణాలను తెలుసుకున్నారు. బావిని పరిశీలించారు. రక్షిత నీరు అందించే పైపుల్లో మురికి నీరు చేరి ఉంటుందని అనుమానం వ్యక్తం చేశారు. గ్రామంలో ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నారు. రెండు వైద్య శిబిరాలు ఏర్పాటు చికిత్స అందిస్తున్నారు. డయేరియా ప్రబలడానికి గల కారణాలపై పూర్తిగా విచారించి వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ఆయన పరామర్శించారు.

## వెంటాడిన మృత్యువు

**అంబులెన్స్‌ను ఢీకొట్టిన కారు... ఎగిరిపడి రోగి మృతి**

కాకినాడ రూరల్, సెప్టెంబరు 2: తీవ్రమైన అనారోగ్యంతో ఉన్న రోగిని తీసుకెళ్తున్న అంబులెన్స్‌ను కారు ఢీకొట్టడంతో మృతి చెందిన సంఘటన కాకినాడ సర్పవరం పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం తెల్లవారుజామున జరిగింది. కాకినాడ రూరల్ మండలం వాకలపూడికి చెందిన పెద్దిరెడ్డి రాధాకృష్ణ (45) కొనేళ్లు ఉద్యోగం చేసి రెండేళ్ల క్రితం కాకినాడ వచ్చి స్థానికంగా ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నాడు. అతడికి భార్య లక్ష్మి, ఇంటర్ చదువుతున్న హర్షిత అనే కుమార్తె ఉన్నారు. సోమవారం తెల్లవారుజామున రాధాకృష్ణ తీవ్రమైన అనారోగ్యంతో ఇబ్బందిపడుతుండటంతో ట్రస్ట్ ఆసుపత్రికి ఫోన్ చేయగా వారి అంబులెన్స్ వచ్చింద. దాంట్లో తరలిస్తుండగా సర్పవరం కూడలి వద్దకు వచ్చేసరికి కారు వెనుక నుంచి అంబులెన్స్‌ను ఢీకొట్టడంతో దాని టైరు పేలి రోగి రాధాకృష్ణ ఎగిరి కిందపడి మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులెవరూ ఫిర్యాదు చేయలేదని, ట్రస్టు ఆసుపత్రి అంబులెన్స్ డ్రైవరు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సర్పవరం సీఐ పెద్దిరాజు తెలిపారు.

## డెంగీతో వ్యక్తి మృతి


మృతి చెందిన రమణ (పాత చిత్రం)

రాజవొమ్మంగి, సెప్టెంబరు 2: అల్లూరి సీతారామరాజు జిల్లా రాజవొమ్మంగి మండలం లబ్బర్తి గ్రామానికి చెందిన పొడుగు రమణ (40) సోమవారం ఉదయం డెంగీతో మృతి చెందాడు. దీనిపై లాగరాయి వైద్యాధికారిణి ఉషశ్రీని వివరణ కోరగా.. రమణ టైఫాయిడ్, కామెర్లతో కొన్ని రోజులుగా వైద్యం పొందుతూ శనివారం లాగరాయి ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చాడన్నారు. మలేరియా, డెంగీ ర్యాపిడ్ టెస్టు (ప్రాథమిక) చేయగా మలేరియా నెగిటివ్, డెంగీ పాజిటివ్ వచ్చిందన్నారు. పూర్తిస్థాయిలో డెంగీ టెస్టు చేయించుకుని వైద్యం పొందేందుకు కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేశామని చెప్పారు. రమణను వైద్యాధికారులు ఏ ఆసుపత్రికీ రిఫర్ చేయలేదని, సకాలంలో సరైన వైద్యం అందకే మృతి చెందాడని కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. ఎంపీడీవో యాదగిరేశ్వరరావు విలేకరులతో మాట్లాడుతూ మండలంలో సోమవారం డెంగీ కేసులు ఏమీ నమోదైనట్టు వైద్యులు రిపోర్టులు ఇవ్వలేదన్నారు. రమణ మృతిపై మాత్రం సంబంధిత వైద్యాధికారి ఉషశ్రీ డెంగీ వీక్ పాజిటివ్ వచ్చిందని చెప్పారన్నారు.

## గుండాల డంప్ నుంచి తెలంగాణకు ఇసుక రవాణా

**టిప్పర్‌ను స్వాధీనం చేసుకున్న భద్రాచలం పోలీసులు**



ఎటపాక, సెప్టెంబరు 2: అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం గుండాల ఇసుక డంప్-1 నుంచి ఇసుక అక్రమ మార్గంలో తెలంగాణకు తరలిపోతున్నట్టు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సోమవారం గుండాల డంప్ నుంచి టిప్పర్‌లో ఇసుక లోడ్ చేసుకుని భద్రాచలం రవాణా చేస్తున్న క్రమంలో భద్రాచలం పట్టణ పోలీసులు టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇటీవల గుండాల ఇసుక డంప్-1 వద్ద కొందరు వ్యాపారస్తులు బినామీ లబ్ధిదారుల ఆధార్ నెంబర్లతో గ్రామ సచివాలయంలో బుక్ చేసుకుని, లోడింగ్ పాయింట్ వద్ద ఇసుక లోడ్ చేసుకుని యథేచ్ఛగా తెలంగాణ ప్రాంతాలకు తరలిస్తున్నట్టు ఆరోపణలు వున్నాయి. పోలీసు, రెవెన్యూ అధికారుల పర్యవేక్షణ, నిఘా కొరవడడంతోనే ఇసుక తెలంగాణకు తరలిపోతున్నట్టు తెలుస్తోంది. రాత్రివేళల్లో కూడా ఈ డంప్ నుంచి ఇసుక దొంగ తనంగా తరలిపోతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారుల పర్యవేక్షణాలోపంతోనే ఇసుకను కొందరు వ్యాపార స్తులు దొంగతనంగా పట్టుకెళ్తున్నారన్నారు. పురుషోత్తపట్నం చెక్‌పోస్టు వద్ద పోలీసులు పటిష్ట నిఘా ఏర్పాటు చేసి తెలంగాణకు అక్రమంగా రవాణా కాకుండా చర్యలు తీసుకోవాలని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లభనేని చందు కోరారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని చెప్పారు.

## ఎంత కష్టమొచ్చిందో!

వర రామచంద్రాపురం, సెప్టెంబరు 2: వీఆర్ పురం సంత వద్ద గుర్తు తెలియని వ్యక్తులు లేగ దూడను కిరాతకంగా నరకడంతో పేగులు బయటకు వచ్చాయి. ఆ దూడను చూసిన వారు పశు వైద్యులకు సమాచారం ఇచ్చారు. రేఖపల్లి పశు వైద్యురాలు డాక్టర్ రాజేశ్వరి, సిబ్బంది శ్రీకాంత్, కృష్ణార్జునరావు మూడు గంటలు కష్టపడి ఆ దూడకు శస్త్ర చికిత్స చేశారు.



## రైలు రద్దుతో... వ్యాన్‌లో వెళ్తుండగా

**కేసముద్రం వద్ద వాగులో కొట్టుకుపోయిన రామవరం, కుతుకులూరు వాసులు**

**ఒకరిని కాపాడిన రెస్క్యూ టీమ్... మరొకరి ఆచూకీ కోసం గాలింపు**


గల్లంతైన నాగభూషణం (పాత చిత్రం)

అనపర్తి, సెప్టెంబరు 2: వ్యాపారం నిమిత్తం తెలంగాణ వెళ్లిన తూర్పు గోదావరి జిల్లా అనపర్తి మండలం రామవరం, కుతుకులూరు గ్రామాలకు చెందిన ఇద్దరు వాగులో గల్లంతయ్యారు. వీరిలో ఒకరిని రెస్క్యూ టీమ్ కాపాడగా మరొకరి ఆచూకీ లభించలేదు. రామవరం గ్రామానికి చెందిన టీకే సునీల్, కుతుకులూరుకు చెందిన నక్కిన నాగభూషణం రామగుండం నుంచి హైదరాబాద్ వెళ్లే సంఘమిత్ర ట్రైన్ ఎక్కారు. అది మధ్యలోనే నిలిచిపోవడంతో కేసముద్రం నుంచి మహబూబాబాద్ వెళ్లేందుకు డీసీఎం వ్యాన్ ఎక్కారు. అది కేసముద్రం వద్ద వాగులో కొట్టుకుపోయింది. సునీల్‌ను రెస్క్యూ టీమ్ కాపాడి ఒడ్డుకు చేర్చారు. గల్లంతైన నాగభూషణం కోసం అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. విషయం తెలుసుకున్న అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సునీల్‌కు ఫోను చేసి పరామర్శించారు. భూషణం ఆచూకీ కోసం ప్రయత్నం చేయాలని అక్కడి అధికారులను ఫోనులో కోరారు.


వీరంగం చేసిన ఎద్దును అదుపు చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

## ఎద్దు వీరంగం: ఇద్దరికి గాయాలు

కాకినాడ క్రైం, సెప్టెంబరు 2: ఓ ఎద్దు వీరంగం చేయడంతో హోంగార్డుతో పాటు ఒక మహిళ గాయాలపాలైంది. స్థానిక భానుగుడి కూడలి వద్ద విధుల్లో ఉన్న హోంగార్డు మహేష్‌ను కుడి కాలు తొడపై పొడవడంతో బలమైన గాయమైంది. మరో మహిళను కూడా గాయపర్చింది. వారిద్దరినీ నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అనంతరం ఆ ఎద్దు వార్ఫ్ రోడ్డు మీదుగా జగన్నాథపురం బ్రిడ్జి వద్ద తుప్పల్లోకి వెళ్లగా ట్రాఫిక్ పోలీసులు అదుపులోకి తీసుకుని వెటర్నరీ వైద్యులకు అప్పగించారు. అనంతరం ఆ ఎద్దును సంరక్షణ నిమిత్తం జంతు హింస నివారణా సంఘం (ఎస్‌పీసీఏ)కి అప్పగించినట్టు ట్రాఫిక్ సీఐ రమేష్ చెప్పారు.

**మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ**

రావులపాలెం, సెప్టెంబరు 2: విరివిగా మొక్కలు పెంచడం ద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెంలో కొత్తకాలనీలో వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మొక్కలు నాటారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మాజీ డీసీఎంఎస్ ఛైర్మన్ కేవీ సత్యనారాయణరెడ్డి, చిలువూరి సతీష్‌రాజు, జక్కంపూడి వెంకటస్వామి, రాచకొండ శ్రీను, సిద్ధిరెడ్డి శ్రీను, కొవ్వూరి జగన్నాథరెడ్డి, వెలగల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

- పేదలకు దుస్తులు, నిత్యావసరాల పంపిణీ
- గ్రామాల్లో రక్తదాన శిబిరాలు, సేవా కార్యక్రమాలు
- బాణసంచా కాల్చి స్వీట్స్ పంపిణీ చేసిన ఫ్యాన్స్

# డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలు







ముమ్మిడివరం: కేక్‌ను కట్‌చేసి పంచుతున్న ఎమ్మెల్యే బుచ్చిబాబు, అల్లవరం: కేక్‌ను కట్ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు, మెట్ల రమణబాబు, పి.గన్నవరం: మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, అంతర్వేది: సఖినేటిపల్లిలో రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, మండపేట: మొక్క నాటుతున్న ఎమ్మెల్యే జోగేశ్వరరావు, వేగుళ్ల లీలాకృష్ణ

అమలాపురం టౌన్, సెప్టెంబరు 2: జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలను సోమవారం అభిమానులు, పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక గడియార స్తంభం సెంటర్‌లో ఏర్పాటుచేసిన జన్మదిన వేడుకల కేక్‌ను ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు కట్‌చేసి అభిమానులకు తినిపించారు. సీనియర్ నాయకులు నల్లా శ్రీధర్, యాళ్ల నాగసతీష్, యేడిద శ్రీను, కంచిపల్లి అబ్బులు, అయితాబత్తుల ఉమామహేశ్వరరావు, బీజేపీ నాయకుడు నల్లా పవన్‌కుమార్, కౌన్సిలర్లు బొర్రా వెంకటేశ్వరరావు, పడాల శ్రీదేవి-నానాజీ, తిక్కా సత్యలక్ష్మి, ఆశెట్టి ఆదిబాబు, దొట్ల బాబు తదితరులు పాల్గొన్నారు. అభిమానులకు కొబ్బరి మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు దెందుకూరి సత్తిబాబురాజు, బట్టు పండు, తిక్కా సరస్వతి, పోలిశెట్టి కన్నా తదితరులు పాల్గొన్నారు. జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి చిక్కం భీముడు ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అమలాపురం ఏరియా ఆసుపత్రితో పాటు తాండవపల్లి గ్రామంలో డొక్కా సీతమ్మ అన్నదాన శిబిరాలను నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, జిల్లా కార్యదర్శి చిక్కాల సతీష్, ఆకుల బుజ్జి, కైరం సత్య, కైరం దొరబాబు, గుమ్మళ్ల సురేష్ పాల్గొన్నారు. టీడీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పొద్దోకు నారాయణరావు ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయం వద్ద పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే ఆనందరావు కేక్ కట్‌చేశారు. కూటమి నాయకులు చుట్టుగుళ్ల కిశోర్, ఇసుకపట్ల రఘుబాబు, బడుగు భాస్కరజోగేష్, అయితాబత్తుల అజయ్, ఈతకోట నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఎస్టీయూ జిల్లా కార్యాలయం వద్ద సచివాలయ వలంటీర్ల సంఘం జిల్లా కన్వీనర్ ఎం.సతీష్ ఆధ్వర్యంలో పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. రెడ్డిపల్లిలో సర్పంచ్ కరాటం రత్నప్రసన్నప్రవీణ్ ఆధ్వర్యంలో ఇంటింటా, రోడ్లపక్కన మొక్కలు నాటారు. సచివాలయ కార్యదర్శి స్వాతి, రాజులపూడి మహేష్, జ్యోతి, నల్లా సతీష్ పాల్గొన్నారు. తాపీ పనివారల సంక్షేమ సంఘం కార్యాలయంలో గౌరవాధ్యక్షుడు దున్నాల శ్రీను, అధ్యక్షుడు కోటిపల్లి రాంబాబు ఆధ్వర్యంలో పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. సంఘ ప్రతినిధులు చిక్కం వెంకటేశ్వరరావు, రేలంగి ముకుందరావు, నల్లా త్రిమూర్తులు, దొమ్మేటి ఉమ, దామిశెట్టి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

**రామచంద్రపురం(ద్రాక్షారామ):** ఎన్నోవ్యక్తిగత విమర్శలతో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌పై దాడిచేసిన వైసీపీ నాయకులకు పవన్‌సత్తా గతఎన్నికల్లో తెలిసొచ్చిందని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు సోమవారం రామచంద్రపురం పట్టణం,మండలంలో జరిగాయి. పట్టణంలో జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని మంత్రి సుభాష్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ ప్రారంభించారు. రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కేకు కట్‌చేశారు. ఏరియా ఆసుపత్రి వైద్యులు నేత్రదాన పక్షోత్సవాలను ప్రారంభించారు. కార్యక్రమంలో జనసేన పట్టణ కార్యదర్శి గొల్లపల్లి కృష్ణ, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ దూడల శంకరనారాయణ, టీడీపీ నాయకులు రేవు శ్రీను, కౌన్సిలర్ అంకం శ్రీనివాస్, నారపురెడ్డి బలరామ్, అధిక సంఖ్యలో జనసైనికులు పాల్గొన్నారు. వెల్లలో రక్తదాన శిబిరాన్ని మంత్రి సుభాష్, పోలిశెట్టి చంద్రశేఖర్ సందర్శించారు. రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చిక్కాల స్వామికాపు, గుండుబోగుల లక్ష్మణరావు, కొమ్మిరెడ్డి కోదండరాముడు, అధిక సంఖ్యలో జనసైనికులు పాల్గొన్నారు. కాపవరంలో జనసైనికులు ఏర్పాటుచేసిన మొక్కలు నాటే కార్యక్రమంలో మంత్రి సుభాష్ పాల్గొన్నారు. వెలంపాలెంలో మంత్రి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం మొక్కలు నాటారు. రామచంద్రపురంలో మంత్రి సుభాష్ నివాసంలో నిర్వహించిన వేడుకల్లో మంత్రి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం కేక్‌కట్ చేశారు. హసన్‌బాదలో జనసైనికులు అన్నదానం నిర్వహించారు.

**కె.గంగవరం:** డిప్యూటీ పవన్‌కల్యాణ్ పుట్టిన రోజున అభిమానులమైన మనమంతా సేవా కార్యక్రమాలు చేద్దామని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. సత్యవాడ, గంగవరం, కోటిపల్లి తదితర గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో అభిమానుల ఆధ్వర్యంలో జరిగిన పుట్టిన రోజు వేడుకల్లో కేక్‌లు కట్ చేశారు. సత్యవాడలో రంగా విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కోటిపల్లిలో మొక్కలు నాటారు. మాధవనగర్‌లో 2వేల మందికి అన్నసమారాధన చేశారు. ఈకార్యక్రమాల్లో కూటమి నాయకులు రేవు శ్రీను, పెమ్మాడి సత్తిబాబు, కర్రి చిట్టిబాబు, అయినవిల్లి సూరిబాబు, పెమ్మాడి జగన్నాధం, తోట వెంకన్న, సలాది శ్రీను, సలాది ప్రకాష్, సలాది రమేష్ పాల్గొన్నారు.

**మామిడికుదురు:** పవన్‌కల్యాణ్ పుట్టినరోజు వేడుకలను మండలంలోని అన్ని గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. మగటపల్లి పాఠశాలలో జడ్పీ మాజీ ఛైర్మన్ నామన రాంబాబు మొక్కలు నాటారు. మొగలికుదురులో పవన్‌కల్యాణ్ అభిమానులు రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. మొగలికుదురులో చిన్నారులు పోతు రేణుక, కొండేటి ఆనందిలు పేదలకు ఆహార పొట్లాలు అందించారు. మామిడికుదురులో సర్పంచ్ గౌస్ మొహిద్దీన్ కేక్ కట్‌చేసి అభిమానులు, నాయకులకు పంచారు. కొమరాడలో టీడీపీ, జనసేన నాయకులు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ కృషిచేయాలని ర్యాలీ నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో కూటమి నాయకులు, పవన్ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**రాయవరం:** పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు మండలంలోని వాడవాడలా సోమవారం ఘనంగా నిర్వహించారు. చెల్లూరు, కూర్మాపురం గ్రామాల్లో జనసైనికులు, టీడీపీ నేతలు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ వేగుళ్ల లీలాకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ వీవీవీ చౌదరి మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ లీలాకృష్ణ కేక్‌ను కత్తిరించగా కూటమినేతలు సంబరాలు జరిపారు. ఆయా గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో కూటమి నేతలు గుణ్ణం పనసయ్య, జంగా రామకృష్ణ, చిక్కం మహేష్, పైడికొండల ప్రకాష్, నడిపిల్లి సతీష్, గుణ్ణం బాబురావు, రాయుడు సురేష్, మందపల్లి సతీష్, తవిటికి శ్రీనివాస్, ముత్యాల చంద్రశేఖర్, తలాటం వెంకటేష్, మాజీ వైస్ ఎంపీపీ దేవు వెంకట్రాజు, జానకి రామయ్య, ముతకుమిల్లి భాస్కరావు, గుణ్ణం సుబ్రహ్మణ్యం, గ్రామాల కూటమి నేతలు పాల్గొన్నారు.

**మలికిపురం:** పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలను మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళాను ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ప్రారంభించారు. గ్రామాల్లో వీధులను శుభ్రపరచడంతో పాటు ఎన్డీఏ నాయకులు మొక్కలు నాటారు. ఆయా గ్రామాల్లో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**అయినవిల్లి:** పవన్‌కల్యాణ్ పుట్టినరోజును సోమవారం ఘనంగా నిర్వహించారు. ముక్తేశ్వరం సెంటర్‌లో కూటమి నాయకుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ కేక్ కట్‌చేసి అందరికీ పంచారు. కొబ్బరి మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు మద్దాల సుబ్బారావు, చీకురుమెల్లి వెంకటేశ్వరరావు, పోలిశెట్టి రాజేష్, సలాది బుచ్చిరాజు, మేడిద దుర్గాప్రసాద్, గుర్రాల రాంబాబు, మద్దాల చంటిబాబు, కడలి ఈశ్వరి, కళ్లేపల్లి సుబ్బరాజు, పెన్మెత్స సూర్యనారాయణవర్మ, కడలి వెంకటసత్యనారాయణ, మామిళ్లపల్లి తాతయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

**ముమ్మిడివరం:** డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలను సోమవారం ముమ్మిడివరంలో ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణదేవరాయ కాపు కల్యాణ మండపంలో జనసేన పార్టీ పట్టణాధ్యక్షుడు కర్రా దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన భారీ కేక్‌ను ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు కట్‌చేసి అభిమానులకు పంచారు. పవన్‌కల్యాణ్ అభిమానులు ముమ్మిడివరంలో భారీ మోటారుసైకిల్ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, పాలు పంపిణీ చేశారు. లంకతల్లెమ్మ గుడి సెంటర్‌లో ఏర్పాటుచేసిన కేక్‌ను ఎమ్మెల్యే బుచ్చిబాబు కట్‌చేసి అందరికీ పంచారు. ఠాణేలంకలో జరిగిన వేడుకల్లో ఆ పార్టీ సీనియర్ నాయకుడు గోదశి పుండరీష్, దూడల స్వామి పాల్గొని కట్‌చేసి అభిమానులకు పంచారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు గుత్తుల సాయి, తాడి నరసింహారావు, చెల్లి అశోక్, గొలకోటి దొరబాబు, దాట్ల పృథ్వీరాజ్, విళ్ల వీరాస్వామినాయుడు, అడబాల సతీష్‌కుమార్, పొద్దోకు నారాయణరావు, దాట్ల బాబు, చిక్కాల అంజిబాబు, నిమ్మకాయల విస్సు, గుద్దటి జమ్మి, పోలిశెట్టి కుమార్, ఆకుల కరుణ, చిక్కం కుమార్, చోడపనీడి బాబి, షేక్ బాబర్, పోలిశెట్టి కృష్ణ, నల్లా మణికంఠ, సుంకర గంగ, గణేశుల సతీష్, గణేశుల శ్రీను, ముత్యాల జయలక్ష్మి, మెండా శివ, అర్థాని శ్రీను, కుంచనపల్లి నారాయణ, మాదాల శ్రీధర్ పాల్గొన్నారు.

**పి.గన్నవరం:** డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆశయ సాధనకు అభిమానులు, జనసైనికులు కృషి చేయాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. పి.గన్నవరం జనసేన కార్యాలయంలో ఏర్పా టుచేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. రక్తదానం చేసిన అభిమానులను అభినందించారు. గన్నవరం సీఐ ప్రశాంత్‌కుమార్ రక్తదానం చేయడంతో ఆయనకు ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. సాయంత్రం త్రీరోడ్ సెంటర్‌లో భారీకేక్ కట్‌చేసి నిరుపేదలకు చీరలు, నిత్యావసరాలు పంచారు. లంకలగన్నవరం లాకుల వద్ద జనసైనికులు, యువత ఏర్పాటుచేసిన కేక్‌ను ఎమ్మెల్యే కట్‌చేశారు. రక్తదానంచేసిన వారికి ప్రశంసా పత్రాలం దిం చారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ నియోజకవర్గ కోఆర్డి నేషన్ కమిటీ ఛైర్మన్ నామాన రాంబాబు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, సర్పంచ్ బొండాడ నాగమణి, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, శిరిగినీడి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి కుమార్, ఆదిమూలం సూరయ్యకాపు, చొల్లంగి సత్తిబాబు, కూటమి నాయకులు, వీరమహిళలు పాల్గొన్నారు. కె.ఏనుగుపల్లి గ్రామపంచాయతీలో కేక్‌కట్ చేసి సచివాలయ సిబ్బందితో పాటు పారిశుధ్య కార్మికులను సన్మానించారు. కుందాలపల్లి పంచాయతీ పరిధిలో సర్పంచ్ పప్పుల శ్రీనివాసరావుఆధ్వర్యంలో మొక్కలు నాటారు. అబ్దుల్ కలామ్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ భీమాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సమకూర్చిన పాలు, పండ్లను సీహెచ్‌సీలో బాలింతలకు, రోగులకు డాక్టర్లు, సిబ్బంది అందించారు.

**రాజోలు:** మండలంలోని పలు గ్రామాల్లో పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలు అభిమానులు, జనసేన పార్టీ నాయకులు, వీరమహిళలు సోమవారం ఘనంగా నిర్వహించారు. తాటిపాక పీహెచ్‌సీలో ఎంపీపీ కేతా శ్రీను మొక్కలు నాటారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు. చింతలపల్లిలో పంట కాల్వలను వైస్ ఎంపీపీ ఇంటిపల్లి ఆనందరాజు శుభ్రం చేశారు. రాజోలు వివేకానంద మనోవికాస కేంద్రంలో గల్ఫ్ జనసైన్యం కమ్యూనిటీ గ్రూపు ఆధ్వర్యంలో మానసిక దివ్యాంగుల మధ్య కేకట్ కట్‌చేసి అందరికీ పంచారు. వారికి మధ్యాహ్న భోజన సదుపాయం కల్పించారు. నిర్వాహకురాలు ఎం.లక్ష్మి గ్రూపు సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

**అంబాజీపేట:** మండలంలోని గ్రామాల్లో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలను పార్టీ నాయకులు, అభిమానులు సోమవారం ఘనంగా నిర్వహించారు. కొర్లపాటివారిపాలెంలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ కేక్‌ను కట్ చేసి పారిశుధ్య కార్మికులకు దుస్తులను పంపిణీచేశారు. అనంతరం జనసేన స్థూపంవద్ద మొక్కలు నాటారు. స్థానిక సెంటర్‌లో ఏర్పాటుచేసిన డొక్కా సీతమ్మ అన్న క్యాంటీన్‌లో ఒక రోజు ఉచిత భోజన కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండలంలో జరిగిన పలు సేవా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు శిరిగినీడి వెంకటేశ్వరరావు, సర్పంచ్ నాగాబత్తుల శాంత కుమారి, నాయకులు గణపతి వీరరాఘవులు, దాసరి వీరవెంకట సత్యనారాయణ, దొమ్మేటి సాయికృష్ణ, కొర్లపాటి గోపి, అరిగెల సూరిబాబు, కొర్లపాటి వెంకటేశ్వరరావు, మైపాల తాతాజీ, బొంతు పెదబాబు, అరిగెల బుజ్జి, నాగాబత్తుల వెంకటసుబ్బారావు, నేదునూరి పెద్దిరాజు, అక్కిశెట్టి పెద్ద పాల్గొన్నారు.

**మండపేట:** డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలను మండపేట పట్టణం, మండలంలో నిర్వహించారు. ఈవేడుకల్లో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ పాల్గొన్నారు. జనసైనికులు ఏర్పాటుచేసిన కేక్‌లను కట్‌చేసి పంచారు. వార్డుల్లో గ్రామాల్లో మొక్కలు నాటారు. పలు చోట్ల మిఠాయిలు పంచారు. ద్వారపూడిలో జరిగిన పవన్ జన్మదిన వేడుకల్లో పవన్ అభిమానులు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, మర్రెడ్డి లక్ష్మణ్, జనసైనికులు, పవన్ అభిమానులు పాల్గొన్నారు.

**కాట్రేనికోన:** ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పల్లంకుర్రులో కేక్ కట్ చేసి పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలు ప్రారంభించారు. జనసైనికుల రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి, మొక్కలు నాటారు. కాట్రేనికోన గేట్‌లో కేక్ కట్ చేసి ప్రభుత్వాసుపత్రిలో రోగులకు రొట్టెలు పంపిణీ చేశారు. కొత్తపాలెంలో కేక్ కట్ చేసి మొక్కలు నాటారు. ఉప్పూడిలో సర్పంచ్ రంబాల రమేష్ ఆధ్వర్యంలో జనసేన జెండాను ఆవిష్కరించి దుప్పట్లు, చీరలు, బియ్యం పంపిణీ చేశారు. చెయ్యేరులో కేక్‌కట్ చేసి మొక్కలు నాటారు. దానాలమ్మగుడి వద్ద త్సవటపల్లి నాగభూషణం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని సందర్శించారు. కందికుప్ప, నడవపల్లి, పెనుమెల్ల, పి.లక్ష్మివాడల్లో పవన్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో మాజీ జడ్పీటీసీ ఇసుకపట్ల వెంకటేశ్వరరావు, సూదా బాబూరావు, త్సవటపల్లి నాగభూషణం, బోణం నాయుడు, సలాది శ్రీహరి, చెల్లి సురేష్, రంబాల చౌదరిబాబు, ఆకాశం శ్రీనివాస్, నూకల దుర్గ, నూకల మూర్తి, నంద్యాల వెంకన్నబాబు, నల్లా పవన్, త్సవటపల్లి మణికుమార్, గ్రంధి నానాజీ, వాండ్రపు శ్రీనివాస్, నంద్యాల సురేంద్ర, బసవా మురళి, సంగీతం రాము, పోలిశెట్టి రాజు, బీమాల సూరిబాబు, కాయల బలరామ్‌పాల్గొన్నారు.

**రావులపాలెం:** ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. రావులపాలెం మండలంలో పవన్‌కల్యాణ్ అభిమానులు బైక్ ర్యాలీ నిర్వహించి బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. రావులపాలెంలో ఎమ్మెల్యే బండారు కేక్‌ను కట్ చేసి అభిమానులకు పంచారు. కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్ ఛైర్మన్ కేవీ సత్యనారాయణరెడ్డి, చిలువూరి సతీష్‌రాజు, జక్కంపూడి వెంకటస్వామి, రాచకొండ శ్రీను, సిద్ధిరెడ్డి శ్రీను, కొవ్వూరి జగన్నాథరెడ్డి, వెలగల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ఆత్రేయపురం:** డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలు వాడవాడలా ఘనంగా నిర్వహించారు. వివిధ గ్రామాల్లోని కూటమి నాయకులు మొక్కలు నాటి పారిశుధ్య కార్మికులకు దుస్తులను పంపిణీ చేశారు. ఆత్రేయపురంలో తహశీల్దారు రాజేశ్వరరావు, ఎంపీడీవో నాతి బుజ్జి, వివిధ శాఖల అధికారులు వన మహోత్సవంలో పాల్గొని మొక్కలు నాటారు. ర్యాలి జనసేన పార్టీ కార్యాలయం వద్ద పారిశుధ్య కార్మికులకు దుస్తులను అందజేసి సత్కరించారు. ఆత్రేయపురం రావిచెట్టు సెంటర్‌లో కొత్తపేట నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి బండారు శ్రీనివాసరావు భారీ కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు ముళ్లపూడి భాస్కరరావు, కరుటూరి నరసింహారావు, కాయల జగన్నాథం, సర్పంచ్‌లు గెద్దం సుధ, నరాలశెట్టి సుబ్బలక్ష్మి, మెర్ల రాము, దుద్దవరపు శ్యామలహరిబాబు, వివిధ గ్రామాల జనసేన పార్టీ అధ్యక్షులు వేడుకల్లో పాల్గొన్నారు. ఆత్రేయపురం: డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ర్యాలి జనసేన పార్టీ కార్యాలయం వద్ద సోమవారం రాత్రి కొత్తపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్ పాల్గొని భారీ కేక్‌కట్ చేశారు. అనంతరం మొక్కలు నాటి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు పంచారు. పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. జనసేన పార్టీ గ్రామ అధ్యక్షుడు బండెల గురవయ్య పాల్గొన్నారు.

**ఉప్పలగుప్తం:** ఉప్పలగుప్తం బాలయోగి పార్కులో అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు మొక్కలు నాటారు. జనసేన నాయకుడు ఆకుల సూర్యనారాయణమూర్తి గ్రామంలో తొమ్మిది మంది రోగులకు ఆర్థిక సహాయం అందించారు. గొల్లవిల్లి ఎంపీపీ పాఠశాలకు తాడాల సుబ్బారావు, వీరబాబు ధనసహాయంతో తాగునీటి వసతి కల్పించారు. బాలికల హాస్టల్లో మాజీ సర్పంచ్ అరిగెల నానాజీ తాగునీటి వసతి ఏర్పాటు చేశారు. మంచెం శ్రీరామ్ స్థానిక అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు కుర్చీలు బహూకరించారు. గోపవరం, చల్లపల్లి, ఎస్.యానాం, వానపల్లిపాలెం, పెదగాడవిల్లి, మునిపల్లి, నంగవరం గ్రామాల్లో జరిగిన పవన్‌కల్యాన్ జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కూటమి నాయకులు అరిగెల నానాజీ, దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, పలచోళ్ల పద్మనాభం, ఆకుల సూర్యనారాయణమూర్తి, చిక్కం సూర్యమోహన్, సలాది నాగరాజు, చిక్కం సుధ, గుత్తాల సుభాష్‌చంద్రరావు, మద్దింశెట్టి ప్రసాద్, మంచెం బాలకృష్ణ, ఆకుల బుజ్జి, కడియం సందీప్ తదితరులు పాల్గొన్నారు.

**ఆలమూరు:** ఆలమూరు, నర్సిపూడి, పెనికేరు, కలవచర్ల, జొన్నాడ గ్రామాల్లో జరిగిన వేడుకల్లో కొత్తపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్ పాల్గొన్నారు. స్థానిక రంగా విగ్రహం వద్ద ఏర్పాటుచేసిన జెండా స్థూపాన్ని ఆవిష్కరించి పార్టీ జెండాను ఆవిష్కరించారు. యువనేత చల్లా సుధీర్ ఏర్పాటు చేసిన నూతన వస్త్రాలతో రైతులను సత్కరించి పంచాయతీ కార్మికులకు బహూకరించారు. కూటమి నాయకులు సూరపురెడ్డి సత్య, వంటిపల్లి పాపారావు, వంటిపల్లి సతీష్, రామానుజుల శేషగిరిరావు, చీపురుపల్లి గణేష్, చల్లా సుధీర్, ఎలుగుబంటి శ్రీనివాస్, డీవీ.రావు సలాది జయప్రకాష్‌నారాయణ, కొత్తపల్లి నగేష్ తదితరులు పాల్గొన్నారు.

**అంతర్వేది:** సఖినేటిపల్లి పంచాయతీ వద్ద ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరానికి ముఖ్య అతిథిగా రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ విచ్చేశారు. 42మంది రక్తదానం చేశారని నామన నాగభూషణం తెలిపారు. అభిమానులు, కూటమి శ్రేణులు ఏర్పాటుచేసిన భారీ కేక్‌ను ఎమ్మెల్యే దేవ కట్‌చేశారు. మండలంలో మెగా అభిమానులతో పాటు జనసైనికులు, వీరమహిళలు, కూటమి శ్రేణులు డిప్యూటీ సీఎం జన్మదిన వేడుకలను అంబరన్నాంటేలా నిర్వహించారు. పేదలకు దుప్పట్లు, ఆహార పొట్లాల పంపిణీ, విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు పంపిణీ చేసినట్టు మండలాధ్యక్షుడు గుబ్బల పణికుమార్ తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్‌లు గొల్లమందల చిట్టిబాబు, రేపూరి రాజేశ్వరి ఏసునరసింహరాజా, ముప్పర్తి నాని, గుండుబోగుల పెద్దకాపు, గెద్దం మహాలక్ష్మీప్రసాద్, తాడి మోహన్‌కుమార్, కొండా కిశోర్, పడాల శంకరం, చాగంటి స్వామి, బర్రే శ్రీను, ఇందుకూరి రమేష్‌రాజు, నాయుడు బాబి, కూటమి శ్రేణులు, జనసైనికులు, వీరమహిళలు పాల్గొన్నారు. అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న గోశాలకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా అంతర్వేదికి చెందిన రావి లీలాధర వెంకటసత్యనారాయణ(బాబి) వంద కిలోల దాణాను అందజేశారు. మొగల్తూరు మండలం శేరేపాలేనికి చెందిన దూసంపూడి సత్యవెంకటరామాంజనేయులు 25కిలోల దాణా అందించారు. అనంతరం స్వామివారి ఆలయంలో పవన్‌కల్యాణ్ గోత్రనామాలతో ఆయురారోగ్యాలతో బాగుండాలని ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ సిబ్బంది సత్యకిరణ్, జనసైనికులు, సేవాబృంద సభ్యులు, రావి ప్రసాద్, జక్కంపూడి మాణిక్యాలరావు, తూము వెంకన్నబాబు, శంకరగుప్తం కొండబాబు, గోశాల సిబ్బంది పాల్గొన్నారు.

**కొత్తపేట:** డిప్యూటీ సీఎం, ప్రముఖ సినీనటుడు పవన్ కల్యాణ్ పుట్టినరోజును పురస్కరించుకుని మెగా అభిమానుల ఆధ్వర్యంలో సోమవారం పాత బస్టాండ్ సెంటర్‌లో వేడుకలు జరిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పాల్గొని కేక్‌ను కట్ చేశారు. అనంతరం భారీ బాణాసంచా కాల్పులతో సంబరాలు జరుపుకున్నారు. ఆసుపత్రిలో రోగులకు పాలు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు ఆకుల రామకృష్ణ, ధర్నాల రామకృష్ణ, బూసి జయలక్ష్మిభాస్కరరావు, కంఠంశెట్టి శ్రీను, యల్లమిల్లి జగన్మోహన్, విళ్ల మారుతీప్రసాద్, చోడపనీడి శ్రీనివాసరావు, నిమ్మకాయల చిన్నయ్యనాయుడు, ముద్రగడ దుర్గాప్రసాద్, రాయి దుర్గారావు, మోకా శివ, దుర్గానాయుడు పాల్గొన్నారు. కొత్తపేట పాతబస్టాండ్ సెంటర్‌లో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పుట్టినరోజు వేడుకలు జనసేన ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అలాగే పంచాయతీ పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేసి అనంతరం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో జనసైనికులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

**అల్లవరం:** బెండమూర్లంకలో గుర్రం కృష్ణ, జనసైనికుల ఆధ్వర్యంలో పవన్‌కల్యాణ్ పుట్టినరోజు కేక్‌ను ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు కేక్ కట్ చేసి మాట్లాడారు. దేవగుప్తం, అల్లవరం, బోడసకుర్రు, గోడితిప్ప, కొమరగిరిపట్నం గ్రామాల్లో జనసేన కూటమి నాయకులు మొక్కలు నాటి జన్మదిన కేక్‌లు కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. జనసేన పార్టీ మండల నాయకుడు కంకిపాటి వీరబాబు పాల్గొన్నారు. డొక్కా సీతమ్మ అన్నదాన శిబిరం ద్వారా పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమాల్లో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబురాజు, కంకిపాటి వీరబాబు, సుంకర సాయి, చిట్నీడి శ్రీదేవి శ్రీనివాస్, తిక్కిరెడ్డి శ్రీనివాస్, కంకిపాటి సుబ్బారావు, రొక్కాల విజయలక్ష్మి నాగేశ్వరరావు, తిక్కా శేషుబాబు, పిల్లా ప్రసాద్, మేడిద శంకరరావు, పిండి గణపయ్య, నల్లా రాము, పిండి సురేష్, కటికిరెడ్డి బాబి పాల్గొన్నారు. నల్లా రాము ఆధ్వర్యంలో ఓడలరేవు, తుమ్మలపల్లి గ్రామాల్లో వృద్ధులకు బియ్యం ప్యాకెట్లు పంపిణీ చేశారు.

**యానాం:** ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పుట్టినరోజు వేడుకలు స్థానిక చిన్నా సెంటర్‌లో పవన్ అభిమానులు, జనసేన నాయకులు ఆధ్వర్యంలో నిర్వహించారు. అభిమానులు ఏర్పాటుచేసిన భారీ కేక్‌ను జిల్లా జనసేన నాయకురాలు జయలక్ష్మి కట్‌చేశారు. అనంతరం టపాసులు కల్చి, స్వీట్లు పంచారు. యానాంలో పవన్ చిత్రపటాలతో అభిమానులు, నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు బంగారం, శివ తదితరులు పాల్గొన్నారు.

**కపిలేశ్వరపురం:** కాలేరు, కోరుమిల్లి గ్రామాల్లో సర్పంచ్‌లు దాయం కావేరి, ఆచంట సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో జనసేన పార్టీ మండపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ వేగుళ్ల లీలాకృష్ణ పాల్గొని కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి మొక్కలు నాటారు. కేక్‌కట్ చేసి స్వీట్స్ పంపిణీ చేశారు. కపిలేశ్వరపురంలో గ్రామసర్పంచ్ సాకా శ్రీనివాస్ ఆధ్వర్యంలో కూటమి నాయకులు మొక్కలు నాటారు. పవన్‌కల్యాణ్ ఫ్యాన్స్ స్థానిక పెద్దవంతెన వద్ద కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమాల్లో సర్పంచ్‌లు దాయం కావేరిశేఖర్‌బాబు, ఆచంట సత్యనారాయణ, సాకా శ్రీనివాస్, కాలేరు జనసేన నాయకులు పెయ్యల యాకోబు, టీడీపీ నాయకులు చంద్రు రామకృష్ణచౌదరి, వల్లూరి కాశీవిశ్వనాధం, ముత్యాల సత్యనారాయణ, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

**ఐ.పోలవరం:** మురమళ్ళ మాణిక్యాంబా ఆలయం వద్ద పవన్ అభిమానులు ఏర్పాటుచేసిన కేక్‌ను ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు కట్ చేశారు. కొమరగిరిలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఐ.పోలవరంలో మల్లిపూడి రాజానాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. గుత్తుల సాయి, చెల్లి అశోక్, ధూళిపూడి చక్రం, కడియం తమ్మయ్య, సలాది శేషారావు, ఉప్పు వాసు, మల్లిపూడి రాజా, రాయపురెడ్డి నీలకంఠేశ్వరరావు, మద్దింశెట్టి పురుషోత్తం, రాయపురెడ్డి బాబి, కాకర్లపూడి రాజేష్‌వర్మ, ఆకుల సత్తిబాబు, పిన్నమనేని శివ, దేవు రాంబాబు పాల్గొన్నారు.







ద్రాక్షారామ: రక్తదాతకు ప్రశంసాపత్రం అందిస్తున్న మంత్రి సుభాష్, రాయవరం: మొక్క నాటుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల, వేగుళ్ల లీలాకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ వీవీవీ చౌదరి, కాట్రేనికోన: మొక్కనాటుతున్న ఎమ్మెల్యే బుచ్చిబాబు, రావులపాలెం: కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఆత్రేయపురం: ర్యాలిలో పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీచేసిన జనసేన నాయకులు

## వైఎస్సార్ వర్ధంతి

అమలాపురం టౌన్, సెప్టెంబరు 2: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం అమలాపురం హైస్కూలు సెంటర్‌లోని ఆయన విగ్రహానికి మాజీ మంత్రి పినిపే విశ్వరూప్, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, పలువురు పూలమాలలువేసి నివాళులర్పించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, జడ్పీటీసీ పందిరి శ్రీహరి, కొనుకు గౌతమి, రుద్రరాజు నానిరాజు, మట్టపర్తి నాగేంద్ర, కుడుపూడి బాబు, చెల్లుబోయిన శ్రీనివాస్, వంటెద్దు వెంకన్నాయుడు, కుడుపూడి భరత్ భూషణ్, గొవ్వాల రాజేష్, చిట్టూరి పెదబాబు, బొంతు గోవిందుశెట్టి తదితరులు పాల్గొన్నారు. బండారులంకలోని కాంగ్రెస్ పార్టీ జిల్లాశాఖ కార్యాలయం వద్ద వైఎస్సార్ వర్ధంతి నిర్వహించారు. జిల్లాశాఖ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు వైఎస్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. నాయకులు అయితాబత్తుల సుభాషిణి, వడ్డి నాగేశ్వరరావు, మాచవరపు శివన్నారాయణ, నిమ్మకాయల ప్రసాద్, మీసాల బాబి పాల్గొన్నారు.

## మెడిసిన్ సీట్లు సాధించిన రీజెన్సీ విద్యార్థులు

యానాం. సెప్టెంబరు2: యానాం రీజెన్సీ విద్యార్థులు పి.యోచన ప్రవీణ్, కె.జ్యోతి, కె.లక్ష్మీహెమ, కె.గంగరాజు పుదుచ్చేరిలోని ఇందిరాగాంధీ మెడికల్ కళాశాలలో, టి.తేజశ్విని మనుకుల వినయాగర్ కళాశాలలో ఎంబీబీఎస్ సీట్లు సాధించారని ప్రిన్సిపాల్ ఎం.ప్రసాద్ తెలిపారు. వీరిని విద్యాసంస్థల అధినేత డాక్టర్ జి.ఎన్.నాయుడు, సత్యేంద్రప్రసాద్ అభినందించారు.

## అంగన్‌వాడీ టీచరు మృతి

మలికిపురం, సెప్టెంబరు 2: మండలంలోని గూడపల్లి గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త ఉలిశెట్టి యశోద (43) గుండెపోటుతో సోమవారం ఉదయం మృతి చెందింది. ఆమె అవివాహిత. ఆమె మృతిపై పలువురు సంతాపం తెలిపారు.

## ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి

మలికిపురం, సెప్టెంబరు 2: రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌కు ఉద్యోగులు సోమవారం వినతిపత్రం అందజేశారు. సీపీఎస్‌ను రద్దుచేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని కోరారు కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు కాంద్రేగుల శ్రీనివాసరావు, గుబ్బల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఘనంగా మంగెన గంగయ్య జయంతి

రాజోలు, సెప్టెంబరు 2: తాటిపాకలో మాజీ ఎమ్మెల్యే మంగెన గంగయ్య జయంతిని కాపు నాయకులు సోమవారం నిర్వహించారు. తాటిపాక సెంటర్‌లో ఉన్న గంగయ్య విగ్రహానికి నివాళులర్పించారు. పోతు కాశీ, ఉప సర్పంచ్ కటికిరెడ్డి బుజ్జి, సుబ్రహ్మణ్యం, గుండాబత్తుల తాతాజీ, తాటికాయల బాబులు, మండేల శ్రీను, అడబాల లక్ష్మణ్, నేదూరి సత్తిఅబ్బులు పాల్గొన్నారు.

## శబరిమలైకు సైకిల్ యాత్ర

మండపేట,సెప్టెంబరు2: అసెంబ్లీ ఎన్నికల్లో పవన్‌కల్యాణ్ విజయం సాధించాలని మండపేటకు చెందిన పవన్ అభిమానులు గుండపురెడ్డి శ్రీనివాస్, సతీష్‌లు అయ్యప్ప దీక్ష చేపట్టారు. పవన్‌కల్యాణ్ డిప్యూటీ సీఎం కావడంతో సోమవారం వారు మండపేట నుంచి సైకిల్‌పై శబరిమలై యాత్ర చేపట్టారు. యాత్రను జనసేన నియోకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ ప్రారంభించారు.

## ఫ్లెక్సీపై పవన్‌కల్యాణ్ సీఎం అని పేర్కొనడంతో వివాదం

రాజోలు, సెప్టెంబరు 2: రాజోలులో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఎదుట ఉన్న జాతీయ రహదారి 216ప్రక్కన పవన్‌కల్యాణ్ అభిమానులు సోమవారం ఏర్పాటుచేసిన ఫ్లెక్సీపై కొణిదెల పవన్‌కల్యాణ్ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి అని పేర్కొనడంతో వివాదం నెలకొంది. దీంతో టీడీపీ శ్రేణులు జనసేన నేతలను నిలదీశారు. దీంతో వారి మధ్య వాగ్వివాదం ఏర్పడింది. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అక్కడకు చేరుకుని ఇరువర్గాలకు సర్ది చెప్పారు. ఎమ్మెల్యే స్వయంగా ఫ్లెక్సీపై ఉప అని రాయడంతో వివాదం సర్దుమణిగింది.

## భవన నిర్మాణ కార్మికులకు రూ.10వేలు జీవనభృతి ఇవ్వాలి

ముమ్మిడివరం, సెప్టెంబరు 2: ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న భవన నిర్మాణ కార్మికులకు నెలకు రూ.10వేలు జీవన భృతి కల్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.దుర్గాప్రసాద్ డిమాండు చేశారు. ముమ్మిడివరంలో సోమవారం గంజా సత్తిబాబు అధ్యక్షతన జరిగిన ముమ్మిడివరం ఏరియా మేషన్ అండ్ కార్పెంటర్స్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ సమావేశం సోమవారం జరిగింది. సమావేశంలో దుర్గాప్రసాద్, యూనియన్ కార్యదర్శి కముజు సత్తిబాబు మాట్లాడారు. సమావేశంలో రెడ్డి వలియాబాబా, పేరూరి రామకృష్ణ, మట్టపర్తి నాగేశ్వరరావు, మట్టపర్తి బాలాజీ పాల్గొన్నారు.

## గోల్డ్ అప్రైజర్ల సమస్యలు పరిష్కరించాలి

ముమ్మిడివరం,సెప్టెంబరు2: గుంటూరులో ఇటీవల నిర్వహించిన ఎస్‌బీఐ గోల్డ్ అప్రైజర్ల ఐదవ వార్షికోత్సవ సభలో గోల్డ్ అప్రైజర్ల సమస్యలను ఆలిండియా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ ఎల్.చంద్రశేఖర్‌కు వివరించగా ఆయన సానుకూలంగా స్పందించినట్టు ఎస్‌బీఐ గోల్డ్ అప్రైజర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నలమాటి కొండలరావు తెలిపారు. ముమ్మిడివరంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

## ఇంటి తాళం పగలగొట్టి..

పి.గన్నవరం, సెప్టెంబరు2: నాగుల్లంక శివారు కందాలపాలేనికి చెందిన యల్లమిల్లి సత్యనారాయణ కొంతకాలంగాఅండమాన్‌లో ఉంటున్నాడు. పాశర్లపూడిలో ఉంటున్న కుమార్తె అప్పుడప్పుడు ఇంటికి వచ్చివెళ్తుంది. సోమవారం మధ్యాహ్నం ప్లాస్టిక్‌వ్యర్థాలు సేకరించేఎం.బండిముత్యాలు, గోవిందల కస్తూరి, వాస్టేరు రాజేష్‌లు బాలిక, పాపతో వచ్చి రహదారి చెంతనున్న సత్యనారాయణ ఇంటి గోడదూకి వెళ్లి ముందు తలుపు తాళంపగలగొట్టి వెనుక తలుపు పగలుకొడుతుండగా స్థానికులు పట్టుకున్నారు. ఎస్ఐ బి.శివ కృష్ణ, సిబ్బంది అక్కడకు చేరుకుని నలుగుర్ని స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేశారు.

## వికశిత్ ఆంధ్రాను విజయవంతం చేయాలి

ఆలమూరు, సెప్టెంబరు2: రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం ప్రతీఏడాది ఆరోగ్య సూచి 15శాతంమేర పెంచేందుకు ప్రవేశపెట్టిన వికశిత్ ఆంధ్రను విజయవంతం చేయాలని ఎంపీడీవో కె.జాన్‌లింకన్ కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమీక్షలో పలు అంశాలపై చర్చించారు. ఎంఈవో కేవీ సుబ్బరాజు, వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవి, పి.శివప్రసాద్ పాల్గొన్నారు.

## కిడ్నీ బాధితుడికి పవన్ అభిమానులు రూ.50వేలు సాయం

పి.గన్నవరం, సెప్టెంబరు 2: లంకలగన్నవరం శివారు డొక్కా సీతమ్మ కాలనీలో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న కొల్లు రవీంద్రకు సోమవారం లంకల గన్నవరం జనసైనికులు, పవన్‌కల్యాణ్ అభిమానులు 30మంది రూ.50వేలు అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, సర్పంచ్ పసలపూడి రామకృష్ణ, ఎంపీటీసీలు అవనిగడ్డ సత్తిబాబు, పప్పుల సాయిబాబు, గూటం రత్నంరాజు, పైడి బుజ్జి, మల్లాడి గోపి, యర్రంశెట్టి వెంకటరమణ పాల్గొన్నారు.